వేసవిలో ఆహ్లాదం.. పార్కుల్లో వినోదం

- ఉద్యానవనాల్లో పిల్లల సందడి
- ఆరోగ్య పరిరక్షణలో పెద్దలు
- ఆటపాటలతో యువత కాలక్షేపం


సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ పార్కులో వ్యాయామం చేస్తున్న మహిళలు, పిల్లలు


పార్కులో ఆటలాడుతూ సేదదీరుతున్న పిల్లలు, పెద్దలు


జాగింగ్ చేస్తున్న స్థానికులు, సీనియర్ సిటిజన్లు

సీతమ్మధార: వేసవి సెలవులు వచ్చాయంటే చాలు.. పిల్లల ఆనందానికి హద్దే ఉండదు. చాలా మంది సొంతూళ్లకు.. లేదా తల్లిదండ్రులతో కలిసి విహార యాత్రలకు వెళ్తుంటారు. ఇంటికి వచ్చే చుట్టాలతో ఆయా కుటుంబాలు సెలవుల్లో ఆనందంగా గడుపుతుంటారు. ఈ సమ్మర్‌లో ఉత్తర నియోజకవర్గంలోని ఉద్యానవనాలు పిల్లలు, వారి తల్లిదండ్రులతో కళకళలాడుతున్నాయి. స్మార్ట్ సిటీగా అభివృద్ధి సాధిస్తున్న విశాఖలో జీవీఎంసీ ఇప్పటికే దాదాపుగా అన్ని పార్కులను స్మార్ట్‌గా తీర్చిదిద్దింది.

వ్యాయామం.. ధ్యానం

నియోజకవర్గంలోని పార్కులన్నీ సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. వేసవి సెలవులు మరికొద్ది రోజుల్లో ముగియనుండటంతో పిల్లలు, పెద్దలు రోజూ సాయంత్రమైతే చాలు పార్కుల్లో చేరి సేదదీరుతున్నారు. పిల్లలు ఆటలు, పెద్దల కేరింతలతో ఆయా ప్రాంతాల్లోని పార్కుల్లో కోలాహలం నెలకొంటోంది. ఆయా ప్రాంతాల్లో జీవీఎంసీ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం తెలిసిందే. బాలయ్య శాస్త్రి లేఅవుట్, సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్ తదితర ప్రాంతాల్లోని పార్కుల్లో ప్రజలు అధిక సంఖ్యలో వ్యాయామం, జాగింగ్ చేస్తూ గడుపుతున్నారు. పిల్లలు కూడా పెద్దలతో కలిసి వచ్చి సందడి చేస్తున్నారు. స్థానిక నివాసుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లోని పార్కుల్లో ప్రజలకు ధ్యానంలో శిక్షణ ఇస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేసే ధ్యానంలో శిక్షణ కోసం ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో రావడం విశేషం.

ప్రజలను రా..రమ్మంటున్న స్నీపర్ పార్కు

జోన్-3 పరిధి 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, ఈస్ట్ పార్క్ ఏరియా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్నీపర్ పార్కు(రాకెట్ పార్కు) నిర్వహిస్తున్నారు. ప్రజలు సేద తీరేలా రూ.2.5 కోట్లతో స్నీపర్ పార్కును అందంగా ఆధునీకరించి, ప్రారంభించడం తెలిసిందే. ఈ పార్కులో వాకింగ్ ట్రాక్‌లు నాలుగు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లల ఆట స్థలం, వర్షం ఆశ్రయాలు, పెర్గోలా నాలుగు, లిల్లీపాండ్, పెవిలియన్, టాయిలెట్స్, గెజిబో, ధ్యానం, యోగా కేంద్రాలు, యాంపీ థియేటర్ ఏర్పాటు చేశారు.

స్నీపర్ పార్కు ప్రతి రోజూ ఉదయం 4 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8.30 గంటల వరకు తెరిచి ఉంటుంది. సీతమ్మధారలోనే ఇది పెద్ద పార్కు కావడం విశేషం. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో ఇక్కడికి తరలివస్తున్నారు. పెద్దలు కబుర్లతో కాలక్షేపంలో మునిగిపోతున్నారు. పిల్లలు షరామామూలుగానే ఆటపాటల్లో వినోదం పొందుతున్నారు. యువత, పిల్లలు వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలు సాధన చేస్తున్నారు. జిమ్‌లో వ్యాయామం కూడా జోరుగా సాగిస్తున్నారు.

సాయంత్రం వేళ సీనియర్ సిటిజన్లు అధిక సంఖ్యలో ఇక్కడ సేదదీరుతున్నారు. వేసవి ఉక్కపోత భరించలేని వారు ఈ పార్కులో పచ్చని మొక్కల నడుమ స్వచ్ఛమైన ఆక్సిజన్ పీలుస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ఈ వేసవి సెలవుల్లో ఇటు పిల్లలు.. అటు పెద్దలు పార్కుల్లోనే అధిక సమయం గడపడం విశేషం.


ఊయల ఊగుతున్న యువతీ యువకులు


జిమ్ చేస్తున్న సీనియర్ సిటిజన్లు


షటిల్ ఆడుతున్న పిల్లలు


స్నీపర్ పార్కులో ధ్యానం చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మన్యు సూక్త హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చక బృందం

సీతమ్మధార: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వెంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో గురువారం మన్యు సూక్త హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జూన్ 1 వరకు మూడు రోజుల పాటు శ్రీభక్తాంజనేయ స్వామికి పూర్ణాహుతి, అభిషేకం జరుగుతాయని అర్చకులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు భక్తాంజనేయకు ఆకుపూజ, సింధూర పూజ నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

భవిత కేంద్రంలో పిల్లలను చేర్పించండి


దివ్యాంగ బాలల సర్వేలో పాల్గొన్న కో ఆర్డినేటర్ గీతా, ఎంఈవో రామారావు

సీతంపేట: అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో గురువారం ఉదయం దివ్యాంగ బాలల సర్వే నిర్వహించారు. డిస్ట్రిక్ట్ ఇంక్లూజి ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ గీతా, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామారావు, భవిత టీచర్లు జగదాంబ, శారద సర్వేలో పాల్గొన్నారు. భవిత కేంద్రంలో ఉన్న సౌకర్యాలు, అందిస్తున్న శిక్షణ, సేవలు వివరించి భవిత కేంద్రంలో పిల్లలను చేర్పించాలని దివ్యాంగుల తల్లిదండ్రులను కోరారు.

అలరించిన సినీ సంగీత విభావరి


సినీ గీతం పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా పల్లవి మ్యూజిక్ సినీ సాంస్కృతిక సంస్థ గురువారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి శ్రోతలను అలరించింది. బి.ఫణిభూషణ్ పాడిన తెలుగు వీర లేవరా, పల్లా బాబ్జి, పావని పాడిన దోరవయసు చిన్నది, ఆంజనేయరెడ్డి, అంబిక పాడిన ఈ గాలిలో ఎక్కడో అలికిడి, వెంకటేష్ మాస్టారు, స్వరూప పాడిన ఎక్కడో చూసిన జ్ఞాపకం, వీరేంద్ర, భాగ్యలక్ష్మి పాడిన నమస్తే.. సుస్వాగతం హుషారైన పాటలు ప్రేక్షకులను ఉత్సాహపరిచాయి. వీరికి కీబోర్డుపై సోమేష్, తబలాతో ఏవీ చలం, ప్యాడ్స్‌తో బాబ్జి, గిటార్‌తో రమణమూర్తి వాద్య సహకారం అందించారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం


అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం బాబు జగ్జీవన్ నగర్‌లోని లక్ష్మీగణపతి దుర్గాసాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శర్మ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో 2 వేల మందికి అన్నదానం జరిపారు. కార్యక్రమంలో గుమ్మిడి వెంకటరావు, కామేశ్వర్, దుర్గారావు, ఇ.రామకృష్ణ, కె.త్రిమూర్తులు, జి.హనుమంతురావు, డి.ఆదినారాయణ, హరికృష్ణ, అప్పలరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజున సహకరించండి

ప్రజలకు డీసీపీ-1 లక్ష్మీనారాయణ విజ్ఞప్తి


మాట్లాడుతున్న డీసీపీ-1 లక్ష్మీనారాయణ

సీతమ్మధార: జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున ప్రజలంతా పోలీసులకు సహకరించాలని డీసీపీ-1 లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. అక్కయ్యపాలెం షాదీఖానాలో గురువారం స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 144 సీఆర్‌పీసీ సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటాయని తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున ప్రజలు ఎవరూ బయటకు రాకూడదని, నలుగురు కలిసి ఉండరాదని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. జూన్ 4న ఊరేగింపులు, ఉత్సవాలు చేయకూడదన్నారు. రౌడీషీటర్లు రోడ్లపై తిరిగితే కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. సైబర్ క్రైంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ విజయకుమార్, ఎస్‌ఐలు జి.వెంకటరావు, ఎం,సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీఆంజనేయం

ఘనంగా హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం


రాజమారుతిగా యోగ సిద్ధాంజనేయ స్వామి


కలశారధనలో భక్తులు


విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్-2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు శ్రీకాంతాచారి సారథ్యంలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో మంగళధ్వని వేదమంత్రాల నడుమ వేడుకలు నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో చూడచక్కగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ సన్నిధానంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విక్వరుణ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు, అష్టోత్తర శత కలశారాధన సంప్రదాయ రీతిలో చేపట్టారు.

రాజమారుతిగా యోగ సిద్ధాంజనేయుడు

యోగ సిద్ధాంజనేయ స్వామి ముత్యాల కవచాన్ని ధరించి రాజమారుతిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామ, హనుమాన్‌ల నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు ఆలయ కమిటీ సభ్యులు, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో విశాఖ సత్తా చాటండి


టీ షర్టులు అందుకున్న మాస్టర్ అథ్లెట్స్

మురళీనగర్: అయోధ్యలో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించిన విశాఖ అథ్లెట్స్ తమ సత్తా చాటి విజేతలుగా తిరిగి రావాలని ఇండియా మాస్టర్ అథ్లెట్స్ సెక్రటరీ జనరల్ మంగ వరప్రసాద్ ఆకాంక్షించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన మాస్టర్ అథ్లెట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ముంబైలో జరిగిన 43వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024లో ఆంధ్రప్రదేశ్ తరఫున విశాఖ నుంచి వెళ్లి స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించిన అథ్లెట్స్‌కు అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి అవసరమైన సూచనలిచ్చారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విశాఖ అథ్లెట్స్ దువ్వూరి సరోజినీ, టి.సుధాకర్, అమిత్ లక్ష్మణరావు పాటిల్, కె.బి.వై.ఎం.కృష్ణప్రసాద్, టి.డి.శశికుమార్, శ్రీరామకృష్ణ, జితేంద్రకుమార్‌లకు టీ-షర్టులు అందజేశారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్క్ కార్యదర్శి పి.ఎస్.ఎన్.రాజు, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు, విశాఖ వెటరన్ అథ్లెట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు పాల్గొన్నారు.

సికింద్రాబాద్-సిల్చార్ రద్దు

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్-సిల్చార్(12513) ఎక్స్‌ప్రెస్ జూన్ 1వ తేదీన రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఎర్నాకుళం-టాటా (18190) ఎక్స్‌ప్రెస్ జూన్ 6 నుంచి 12వ తేదీ వరకు మళ్లించిన మార్గంలో వయా విజయనగరం, ఖుర్దారోడ్, కటక్, జక్‌పూర, జరోలి మీదుగా నడుస్తుంది. టాటా-ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ జూన్ 7 నుంచి 14వ తేదీ వరకు మళ్లించిన మార్గంలో వయా జరోలి, జక్‌పురా, కటక్, ఖుర్దారోడ్, విజయనగరం మీదుగా నడుస్తుంది.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

తాటిచెట్లపాలెం: సీఐటీయూ అక్కయ్యపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ అధ్యక్షుడు కె.ఎస్.కుమార్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై వారిని ఐక్యం చేసి పనిచేస్తున్న ఏకైక సంఘం సీఐటీయూ అని తెలిపారు. ఎవరు అధికారంలోకి వచ్చినా కనీస వేతన చట్టం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిటూ జోన్ కార్యదర్శి ప్రకాశరావు, ఎస్.బాబ్జి, ప్రభాకర్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు విశేష స్పందన


గైస్‌లో విద్యార్థుల కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో గురువారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్‌కు అత్యధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. గైస్‌లో 43,001- 51,000, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 51,001-59,000, పెందుర్తిలో 43,001-59,000 ర్యాంకుల విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించగా.. 569 మంది సర్టిఫికెట్లు పరిశీలించారు. గైస్‌లో 239 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 264 మంది, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 66 మంది కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.

నేటి కౌన్సెలింగ్ వివరాలు..

శుక్రవారం నిర్వహించే సర్టిఫికెట్ల పరిశీలనకు గైస్‌లో 59,001-67,000, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 67,001-75,000, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీలో 59,001-75,000 ర్యాంకర్లు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోగా హాజరు కావాల్సి ఉంది. ఎస్టీ విద్యార్థులు కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలకు హాజరవ్వాల్సి ఉంటుంది.

ధ్యాన మందిరంలో సేవా కార్యక్రమాలు



ధ్యాన మందిరం వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది


తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక సేవా కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్స్, సంధ్య డెంటల్ క్లినిక్‌ల సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బందితోపాటు సుమారు 120 మంది భక్తులు పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు, పేదలకు, యాచకులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు, హాస్పిటల్ వైద్య సిబ్బంది డాక్టర్ సాయి చందు, అభి, డాక్టర్ రేష్మ(డెంటల్ సర్జన్), డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో సరికొత్త చీరలు

దాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్‌లో గల లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో సరికొత్త చేనేత, కాటన్, కలంకారీ చీరలు అందుబాటులోకి తెచ్చినట్టు సంస్థ మేనేజర్ ఎ. కార్తీక్ తెలిపారు. ఎంపిక చేసిన మంగళగిరి కాటన్, కొత్త కలర్ షేడ్స్‌లో సిల్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ కలంకారీ, పెన్ పెయింటెడ్ కలంకారీ చీరలు, మరెన్నో చేనేత చీరలు ప్రత్యేకించి మహిళల కోసం అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎంచుకున్న హస్తకళలపై 15 నుంచి 20 శాతం ప్రత్యేక ప్రమోషనల్ డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. వేసవి కోసం అందుబాటులో ప్రత్యేక హ్యాండ్‌మేడ్, హ్యాండ్లూమ్ చీరలు ప్రదర్శన, విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు.

యువ పారిశ్రామికవేత్తలకు అవకాశాలు మెండు


యూబీఐ జోనల్ హెడ్ శాలిని మీనన్‌కు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు


సదస్సులో పాల్గొన్న యువ పారిశ్రామిక వేత్తలు, అధికారులు

ఏయూ క్యాంపస్: స్వశక్తితో ఎదిగే యువ పారిశ్రామికవేత్తలకు అనేక అవకాశాలు ఉంటున్నాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ శాలిని మీనన్ అన్నారు. గురువారం ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో రోటరీ క్లబ్ విశాఖపట్నం 3020, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్, యూబీఐ సంయుక్తంగా యువ పారిశ్రామికవేత్తల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణించాలని ఆకాంక్షించే వారికి అనేక వేదికలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఎంఈఎంఎస్‌ల ద్వారా రుణాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రోటరీ క్లబ్ విశాఖ అధ్యక్షుడు ఆర్.టి.ఎస్.డి.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ లీలారాణి, ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.చంద్రమౌళి, ఎన్ఆర్‌డీసీ రీజినల్ మేనేజర్ బి.కె.సాహు, ఉపేంద్ర శ్రీనివాస్, రోటరీ క్లబ్ విశాఖపట్నం కార్యదర్శి పి.వి.రఘుపతి, పెద్ద సంఖ్యలో యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగి అనుమానాస్పద మృతి

సీతమ్మధార: దొండపర్తి సమీపంలోని ఒక హోటల్‌లో ప్రభుత్వ మహిళా ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. విజయవాడకు చెందిన శ్రీలక్ష్మి(36) స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గుమస్తాగా పనిచేస్తోంది. 2021లో ఆమె భర్త మృతి చనిపోవడంతో ఈ ఉద్యోగం వచ్చింది. కాగా ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్దిరోజులుగా ఆమె విజయవాడకు చెందిన మహేష్‌బాబుతో చనువుగా ఉంటుంది. అతడు విదేశాలు వెళ్లేందుకు పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోగా.. గతంలో నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో కేసు ఉండటంతో మంగళవారం విశాఖ వచ్చారు. దొండపర్తి దరి అయోధ్య హోటల్‌లో దిగారు. బుధవారం ఉదయం ఆమెకు ఛాతిలో నొప్పి రావడంతో దగ్గరలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అయినా తగ్గకపోవడంతో ఆమె సోదరికి ఫోన్ చేసి వెంటనే విశాఖ రావాలని చెప్పింది. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో మహేష్‌బాబు 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఫోర్త్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం 8వ నంబర్ ప్లాట్‌ఫాం వెనుక ఉన్న వెస్ట్‌సైడ్ బ్లాక్ వద్ద పునాదులు వేసి ఉంచిన సుమారు 5 అడుగుల లోతు నీరు కలిగి ఉన్న ఓ చెరువులో సుమారు 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి గురువారం మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఐదో పట్టణ ఎస్‌ఐ రవికుమార్‌తోపాటు హెడ్ కానిస్టేబుల్ మూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రాంతంలో చుట్టుపక్కల ఉన్న యాచకులు తదితరులు అక్కడే నివసిస్తూ, ఆ నీటిలోనే స్నానాలు చేస్తుంటారని, మృతుడు కూడా చిత్తు కాగితాలు ఏరుకుంటూ, అక్కడే స్నానం చేస్తుంటాడని, ఆ చుట్టుపక్కలే జీవిస్తుంటాడని స్థానికులు చెబుతున్నారు. జ్ఞానాపురం మహిళా పోలీస్ లావణ్య ప్రియ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


సత్యనారాయణ

అల్లిపురం: న్యాయవాది ఒకరు కోర్టుకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలిలా.. మర్రిపాలెంలోని సాయినగర్ కాలనీకి చెందిన కేవీవీ సత్యనారాయణ (45) న్యాయవాదిగా జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ నెల 28న ఆయన ఇంటి నుంచి కోర్టుకు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు కోర్టు పరిసర ప్రాంతాలు, నగరంలోని పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవటంతో టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 9949925839 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.